క్లుప్తంగా

ఆస్పత్రికి సామగ్రి వితరణ



వితరణ చేసిన సామగ్రితో వైద్యులు, ఫ్యాక్టరీ యాజమాన్యం

తాడిపత్రి టౌన్: తాడిపత్రి ఏరియా ఆస్పత్రికి యాడికి మండలం గుడిపాడు వద్ద ఉన్న సాగర్ సిమెంట్ లిమిటెడ్ యాజమాన్యం గురువారం సామాజిక బాధ్యతలో భాగంగా రూ.5 లక్షల విలువ చేసే వస్తువులు వితరణ చేశారు. ఆస్పత్రికి అవసరమైన త్రీ సీటర్ స్టీల్ చైర్, వాటర్ డిస్పెన్సర్స్, కప్ బోర్డ్, ప్రింటర్స్, హై ఎలక్ట్రిసిటీ యూపీఎస్‌లు, బ్యాటరీలు, రాక్స్‌లు అందజేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సెల్విన్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రంగారెడ్డి, ఫ్యాక్టరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రభాకర్, ఏజీఎం శ్రీమన్నారాయణ వెల్ఫేర్ అధికారి మధుసూదన్, డాక్టర్ క్రిష్ణవేణి, ఇజ్దాని, నర్సులు సుజాత, విమల తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పాలన

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఆర్‌ఐ, వీఆర్వోలు పోస్టుల ఖాళీ
- ఇబ్బందుల్లో ప్రజలు

పామిడి: తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది కొరత వేధిస్తుండడంతో పాలన పడకేసింది. ఆర్‌ఐ, పలు వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్య, వైద్య, భూమి, ప్రభుత్వ పథకాల వర్తింపు, ఇతరత్రా లబ్ధి చేకూరాలంటే రెవెన్యూ పరంగా మంజూరయ్యే ధ్రువీకరణ పత్రాలపైనే ఆధారపడి ఉంది. పామిడి మండలానికి సంబంధించి 18 సచివాలయాలు ఉన్నాయి. రెవెన్యూ పరంగా ఆ సచివాలయాల సంబంధించి 18 మంది వీఆర్వోలతో పాటు ఒక ఆర్‌ఐ ఉండాలి. ఇటీవల కొందరు వీఆర్వోలు బదిలీ అయ్యారు అందులో కత్రిమల వీఆర్వో అమర్నాథ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. 18 మంది వీఆర్వోలకు గాను 14 మంది మాత్రమే ఉన్నారు. రామగిరి వీఆర్వోగా పనిచేస్తున్న రామాంజనేయులు నార్పలకు, ఎద్దులపల్లి వీఆర్వోగా పనిచేస్తున్న కాంత కుమారి గుత్తికి బదిలీ అవ్వగా, ప్రస్తుతం రామరాజుపల్లి వీఆర్వోగా పనిచేస్తున్న జయచంద్రారెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. దీంతో కత్రిమల, ఎద్దులపల్లి, రామగిరి, రామరాజుపల్లి సచివాలయాలకు సంబంధించి నలుగురు వీఆర్వో పోస్టులు ఖాళీ పడ్డాయి. దీనికితోడు ఆరు నెలల క్రితం లంచం తీసుకుంటూ ఆర్‌ఐ క్రాంతి కుమార్ ఏసీబీకి పట్టుబడడంతో ఆ పోస్టు అప్పటి నుంచి ఖాళీగా ఉంది. దీంతో ఎలాంటి సర్టిఫికెట్ మంజూరు చేయాలన్నా సంబంధిత వీఆర్వో, ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్ సంతకాలతో కూడిన ఫైలింగ్‌తోనే రెవెన్యూ సర్టిఫికెట్లు మంజూరౌతున్నాయి. సిబ్బంది కొరత వల్ల రెవెన్యూ పరమైన సర్టిఫికెట్ల కోసం కార్యాలయా చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేసి సకాలంలో రెవెన్యూ పరమైన సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



పామిడి తహసీల్దార్ కార్యాలయం

వీఆర్‌ఓ లేక ఇబ్బందులు



ఐదు ఎకరాల్లో వేరుశనగ, నాలుగు ఎకరాల చొప్పున వరి, చీనీ, మూడు ఎకరాల్లో శెనగ పంట సాగుచేశా. వ్యవసాయపరమైన పంటల సాగుకు సంబంధించి సర్వేపై చేయడంలో వీఆర్‌ఓ కీలకం. దీనికితోడు ఈ–క్రాఫ్, ఈ–కేవైసీ ఇతరత్రా ఆన్‌లైన్ నమోదుకు వ్యవసాయ అధికారులకు వీఆర్‌ఓల అవశ్యకత ఉంది. ఒక్కడ పనిచేస్తున్న వీఆర్వో బదిలీ కాగా, కొత్తవారిని కేటాయించకపోవడంతో వ్యవసాయ పరమైన సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం జరుగుతోంది

–చుక్కలూరు రామచంద్రారెడ్డి, రైతు, ఎద్దులపల్లి, పామిడి మండలం

సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం



నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. పెద్ద అమ్మాయి బిందుశ్రీ పామిడి మోడల్‌స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. రెండో అమ్మాయి సింధూశ్రీ 3వ తరగతి, కుమారుడు అంక్షిత్‌రెడ్డి ఎద్దులపల్లిలోనే 1వ తరగతి చదువుతున్నారు. సిబ్బంది కొరతతో వారి విద్యా సర్టిఫికెట్ల మంజూరులో జాప్యమవుతోంది. ఆర్‌ఐ, వీఆర్‌ఓలు లేక ఇన్‌కమ్, కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

–కొండూరు కేశవరెడ్డి, ఎద్దులపల్లి, పామిడి మండలం

ఉన్నతాధికారులకు నివేదించాం



ఇటీవల వీఆర్వోలు ఇతర మండలాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానాల్లో కొందరు కొత్తవాళ్లు రావాల్సి ఉంది. ఇకపోతే కొన్ని నెలలుగా ఆర్‌ఐ లేక భూ అవకతవకలు వంట రెవెన్యూ సేవలకు తీవ్ర జాప్యమవుతోంది. పామిడికి ఆర్‌ఐను కేటాయించే వరకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలిస్తున్నాం. రెవెన్యూ సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. అంతవరకూ ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలందిస్తాం.

–ఎస్.శ్రీధర్‌మూర్తి, తహసీల్దార్

మాజీ సీఎం జగన్‌ను కలసిన బొంబాయి రమేష్ నాయుడు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన బొంబాయి రమేష్ నాయుడు, ఆయన కుమారులు

యాడికి: విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం యాడికి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఆయన కుమారులు కల్యాణ్‌బాబు, ఉపేంద్ర నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మండల పరిస్థితుల గురించి అడిగారన్నారు. పేదల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని, పార్టీని పూర్వ వైభవం కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పోవాలని సూచించారన్నారు.

ఘనంగా ఆయుధ పూజ



ఆయుధ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కసాపురం రోడ్డు సమీపంలోని దుర్గమ్మ ఆలయంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడుస్తూ దేశాన్ని, సనాతన ధర్మాన్ని స్త్రీలను, గోమాతను, దేవాలయ భూములను కాపాడుకోవాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి



ఆర్డీఓకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు

గుంతకల్లు రూరల్: ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని ఆర్డీఓను గుంతకల్లు రెవిన్యూ సబ్ డివిజినల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్‌ను గురువారం ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ గుంతకల్లు రెవిన్యూ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని విన్నవించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని విన్నవించారు.

వంటనూనె విక్రయ కౌంటర్ల ఏర్పాటు



గుంతకల్లులో నూనె ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రమాదేవి, సిబ్బంది



గార్లదిన్నెలో నూనె ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్/గార్లదిన్నె: నాణ్యమైన ధరకే వంటనూనె విక్రయానికి గుంతకల్లు పట్టణంలోని కూరగాయల మార్కెట్, వన్‌టౌన్ పీఎస్ ఎదురుగా రెండు ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. జిల్లా ఆయిల్ ట్రేడర్స్ అసోసియేషన్ సౌజన్యంతో పౌరసరఫరాశాఖ ఆధ్వర్యంలో గురువారం వన్‌టౌన్ పీఎస్ ఎదురుగా ఉన్న డీబీ.రంగయ్య, మార్కెట్‌లోని రామ్మోహన్ దుకాణాల వద్ద తక్కువ ధరకే నూనె ప్యాకెట్ల విక్రయ కేంద్రాలను తహసీల్దార్ ప్రారంభించారు. పామాయిల్ లీటర్ రూ.118, సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.127కే విక్రయిస్తారన్నారు. టీడీపీ నాయకుడు నారాయణస్వామి, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, ఆర్‌ఐ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెలో సంజీవరాయ ఆయిల్ ట్రేడర్స్, సుబ్రమణ్యేశ్వర దుకాణంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ ధరలకే వినియో గదారులకు పామాయిల్, సన్‌ఫ్లవర్ పంపిణీ చేశారు. తహసీల్దార్ ఈరమ్మ, సీఎస్‌డీటీ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు: మద్యం షాపుల లైసెన్సుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ శివసాగర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం షాపుల లైసెన్సులకు దరఖాస్తుల గడువు ఈనెల 11న సాయంత్రం 7 గంటలకు ముగియనున్న నేపథ్యంలో ఔత్సాహికులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుంతకల్లులో మొత్తం 14 మద్యం షాపుల ఏర్పాటుకు 107 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు.

బుక్కరాయసముద్రం: బీకేఎస్, నార్పల, గార్లదిన్నె, శింగనమల మండలంలో మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ నాగ సునీత సూచించారు. గురువారం బీకేఎస్ మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. శింగనమల, గార్లదిన్నె బీకేఎస్, నార్పల మండలాలకు సంబంధించిన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 షాపులకు గాను 350 దరఖాస్తులు వచ్చాయన్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు.

ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ తేజోష్ణ

పామిడి: స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ పంచాయితీ పరిపాలన విభాగంపై శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది.. ఈ సందర్భంగా ఎంపీడీఓ తేజేష్ణ మాట్లాడారు. పంచాయతీలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల ఎంపికతో పాటు పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీ పరిపాలన విభాగానికి సంబంధించి పలు అంశాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడితోనే మానసిక అనారోగ్యం



పెద్దవడుగూరులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసబాబు



యాడికి మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

పెద్దవడుగూరు: అధిక ఒత్తిడితో పని చేయడం వల్ల మానసిక అనారోగ్యం సంభవిస్తుందని జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథరెడ్డి , పెద్దవడుగూరు డాక్టర్ శ్రీనివాసబాబు అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పని ఒత్తిడి పెరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పని చేసే ప్రదేశంలో ఒత్తిడిని ఎలా జయించాలో వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలో గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీరామ్ కుమార్, పరమేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ విశ్వనాథరెడ్డి, వైద్య సిబ్బందితో కలిసి ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం మీహెచ్‌సీ పరిధిలో ఉన్న మానసిక రోగులకు చిత్స చేసి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ బాలాజీరాజ్

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉందని తహసీల్దార్ బాలాజీరాజ్, ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య) అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులతో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ఇటీవల పెద్దపప్పూరు మండలానికి బదిలీపై వచ్చిన పలు శాఖలకు చెందిన సిబ్బంది పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం శివకుమార్‌రెడ్డి, ఏఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి తైక్వాండో జట్టుకు ఎంపికైన తాడిపత్రి విద్యార్థులు



జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన గుత్తి క్రీడాకారిణులు గౌతమి, సుహన

తాడిపత్రిటౌన్ : జాతీయస్థాయి (అండర్–19) కబడ్డీ పోటీలకు సాయిచైతన్య విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ లక్ష్మీనరసింహ తెలిపారు. శ్రీకాకుళంలో జరిగిన అండర్–19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాఠశాలకు చెందిన గౌతమి, సుహన ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.

తైక్వాండో జాతీయ జట్టుకు ఎంపిక

గుత్తి: గుత్తిలోని సాయి స్పోర్ట్ యూనిట్‌కు చెందిన నలుగురు విద్యార్థులు తైక్వాండో జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు సాయి స్పోర్ట్స్ యూనిట్ మాస్టర్ సాయి తేజ గురువారం తెలిపారు. అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకూ రైల్వే కోడూరు, తిరుపతిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తైక్వాండో పోటీలు నిర్వహించగా సాయి స్పోర్ట్స్ యూనిట్‌కు చెందిన పూజిత, కీర్తన, కరిష్మా, సృజన పాల్గొన్నారు. వారు గోల్డ్ మెడల్స్ సాధించి, జాతీయ జట్టుకు ఎంపిక య్యారు. వారు త్వరలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

శ్రీవారికి మహా అన్నకూటోత్సవ సేవ



ఉత్సవ మూర్తికి అన్నకూటోత్సవ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ఇష్టమైన అనేక రకాలతో కూడిన నేవైద్యాలతో మహా అన్నకూటోత్సవ సేవ ఘనంగా చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి, సభ్యులు జయంతి వెంకట్, సుదర్శన్, ప్రవీణ్, రవి, నాగభూషణం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటో బోల్తా..

- పలువురికి గాయాలు

తాడిపత్రి రూరల్: స్థానిక పుట్లూరు రైల్వే గేట్ సమీపంలో గురువారం ఆటో బోల్తాపడి 9 మంది గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహన చోదకుడుని ఆటో డ్రైవర్ గుర్తించి తప్పించబోవడంతో బోల్తాపడింది. ఆటోలో ఉన్న అరటి కాయలు చెల్లాచెదురయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది గాయపడ్డారు. క్షతగాత్రులను తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో పుట్లూరు మండలం సూరేపల్లికి చెందిన ఎర్రిస్వామి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అనంతపురానికి రెఫర్ చేశారు. సీఐ శివగంగాధరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాడిపత్రి రూరల్: స్థానిక పప్పూరు రోడ్డు పెన్నానదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. పెన్నానది నుంచి ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లుగా నిర్ధారణ కావడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి, డ్రైవర్లు షేక్ రసూల్, జయకృష్ణ, గంగారి లక్ష్మయ్యపై కేసు నమోదు చేశామన్నారు.

పరామర్శ

పామిడి: పట్టణంలోని 1వ వార్డుకు చెందిన నైటీల సుధాకర్ గురువారం ఆకస్మికంగా మృతిచెందాడు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టండి



మాట్లాడుతున్న సీపీఐ తాలూకా కార్యదర్శి రంగయ్య

తాడిపత్రిటౌన్/తాడిపత్రి రూరల్: ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఐ తాలూకా కార్యదర్శి రంగయ్య ధ్వజమెత్తారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెన్నానదిలో నిత్యం ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. అధికారుల తీరుకు నిరసనగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 14న ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు. పెన్నానదిలో ఇసుక రవాణా వల్ల భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటి ప్రజలకు తాగునీటి సమస్య నెలకొనే అవకాశం ఉందన్నారు. అలాగే పరిశ్రమలు మూతపడే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగ రంగయ్య, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, వ్యవసాయ కార్మికసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, రైతుసంఘం నాయకులు కుళ్లాయప్ప, యర్రప్ప, సురేష్, మునెమ్మ, సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రి టౌన్: మహిషాసుర మర్దినిగా పార్వతీదేవి



గుంతకల్లు రూరల్: మహిషాసుర మర్దినిగా కన్యకాపరమేశ్వరి



గుత్తిలో మహిషాసురమర్దినిగా వాసవీ మాత



పామిడిలో మహిషాసురమర్దిగా కన్యకా పరమేశ్వరి



పెద్దపప్పూరులో కాళికాదేవిగా చౌడేశ్వరీమాత



గార్లదిన్నె: కల్లూరులో దుర్గాదేవిగా అమ్మవారు



బీకేఎస్‌లో దుర్గాదేవిగా పెద్దమ్మ తల్లి

జయహే మహిషాశురమర్దిని..

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో గురువారం శరన్నవరాత్రి వేడుకలు ఎనిమిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మహిషాశురమర్దినిగా, దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



శింగనమలలో దుర్గాదేవిగా కన్యకా పరమేశ్వరి



పెద్దవడుగూరులో దుర్గాదేవిగా అమ్మవారు

తాడిపత్రిలో యువకుల రాళ్ల దాడి

తాడిపత్రి టౌన్: పాత కక్షల కారణంగా తాడిపత్రిలో యువకుల మధ్య రాళ్ల దాడి చోటు చేసుకుని పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు తాడిపత్రిలోని జింకా వారి వీధిలో నివాసముంటున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ కుమారుడు రవితేజకు స్థానికంగానే ఉంటున్న రజక సాయికృష్ణ మధ్య పాత కక్షలున్నాయి. నెల రోజుల క్రితం పుట్లూరు రోడ్డులో సాయికృష్ణ, రవితేజ ఘర్షణ పడ్డారు. స్థానికులు సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. గురువారం సాయికృష్ణ, తన స్నేహితులు మనోజ్, సతీష్, మరికొందరితో కలసి రవితేజ ఇంటిపై రాళ్లు రువ్వారు. దాడిలో రవితేజ సోదరులు రిషీంద్ర, మణికంఠ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.